# చైత్రంలో హేమంతం

బి. సత్యనారాయణ

తలుపు తెరుస్తూనే "మీరింతవరకు యేం చేస్తున్నారూ?" అని అన్నపూర్ణ అధికారిలాగా ప్రశ్నించేసరికి శ్రీనివాసరావు తనలో తానే నవ్వుకున్నాడు.

'గొప్ప ఘనకార్యం చేసినవారిలాగు నవ్వుతారుగూడా. రేపటినుంచి పెందరాళే యిల్లు చేరుకోకపోతే నేను పుట్టింటికి వెళ్తానుసుమండీ!" తిరిగి అన్నపూర్ణ మందహాస పూరితంగా తలుపు గడియవేస్తూ అంటుంటే వాసు యిక పుగ్గబట్టుకో లేక కుర్చీలో కూలబడుతూ విరగబడి నవ్వాడు. ఆ నవ్వులో అన్నపూర్ణ తనకు తెలియకుండానే కలిసిపోయింది.

అతడు నవ్వుతూనే "కాసిని మంచినీళ్లు తీసుకరా" అన్నాడు పైపంచను ఆమెమీదకు విసురుతూ.

"ఏం? పాపం! అంతగా అలిసిపోయారేం. తుండుగుడ్డ కట్టుకొని స్నానానికిగూడా లేవండి త్వరగా. పదకొండు కాస్తూంది. అర్ధరాత్రి పూట అంకమ్మ శివాలలాగా అవశిష్టాలు అర్ధరాత్రయినా జరగవలసిందే మనకు."

అన్నపూర్ణ కొద్దిగా విసురుతనంగా భర్తతో మాట్లాడడం యీమధ్యనే ప్రారంభమయింది. ఆమాట లైనా ఎల్లప్పుడూ నిండుప్రేమతో తొణికిస లాడుతూనే వుంటయి. ఆ విసురుతనానికైనా కారణం కొద్దిగా ఆలస్యంగా ఇల్లు చేరుకోవడమే. ఆమె కాపురానికొచ్చి దాదాపు రెండు సంవత్సరా లవుతుంది. ఈ రెండేండ్లు వారి సంసారం మధురాతి మధురంగా సాగింది. ఒకరిని విడిచి మరొకరుండ లేనంతగా తయారయ్యారు యిద్దరూను. పుట్టింటివైపుకే ఆమె మన సెప్పుడూ పోయిందిగాదు. కాని కొద్ది రోజులనుంచీ శ్రీనివాసరావులో కన్పించినమార్పు ఆమెను కలవర బెట్టింది. తన భర్త పెడదారిని పడ్డాడని భయపడింది. అతను తరచుగా పరధ్యాన్నంలో మునిగివుండడం, కొద్దిగా ఆలస్యంగా యిల్లు చేరుకోవడం యివే ఆమె అనుమానాన్ని మరింత దృఢపరిచాయి.

"మావూరొక పర్యాయం వెళ్దాము. ఆఫీసుకు సెలవు పెట్టండీ." అంది ఆరాత్రికి భర్త నోటికి తమలపాకులను అందిస్తూ.

"ఏం? ఎన్నడూ లేంది పుట్టింటివైపుకు పోయిందేం బుద్ధి, అంతగావుంటే నీ వెళ్లు. నేను గూడా యెందుకూ?" అన్నాడు.

"నేను వెళ్తే వున్నకని కాస్తా విరుగుడౌతుందనా?" భర్త ముఖానికి ముఖాన్నానించి నవ్వుతూ అంది.

"నీతో యెలా మాట్లాడినా కష్టమే. నీ నీడను చూచి నీవే భయపడుతావయ్యే. నేనేం చెయ్యను చెప్పు."

"అదంతా యెందుకూ. ఆఫీసుకు సెలవు పెట్టండి. బయలుదేరుదాము" అంది అతని తల నిమురుతూ.

"ఏడ్చినట్లుంది. వున్న వుద్యోగం యింతవరకు ఖాయంగా లేదు. జల్సాగా సెలవుమీద వూరేగుతానంటే ఏ ఆఫీసరు యిస్తాడూ? పైగావున్న గుమాస్తాలలో యిప్పు డిద్దరు సెలవులమీదే వున్నారు. నీ ఒక్కదానివి వెళ్లు, పంపిస్తాను" అని ఆమె చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

ఆమెకోపంతో చేతిని లాగుకుంటూ "ఆమాటే అనవద్దని చెప్పాను. మీరు రాండి నేను వెళ్ళను"

"సరే యిక్కడేవుండు. నే నేమీ బలవంతంగా పంపడం లేదుగదా."

"అహా! నేను వెళ్ళాలి. అందుకే. మీరూ రావాలి" ఆమె పక్కున నవ్వింది. కాని పూర్వమున్నంత అమృతం లేదు యిప్పుడా నవ్వులో.

'సరే. సెలవు పెడ్తాను. వచ్చే పంచమీ సోమవారం మంచిది ప్రయాణానికి."

"ఆ అలా దారికిరండీ. అయినా యింకా పదిరోజులే" అంటూ భర్తను అమాంతం కౌగిలించుకుంది.

వారం రోజులు వారికి తెలియకుండానే గడిచి పొయ్యాయి.

"యివాళ సెలవుపెట్టి వస్తారు గదా గుడ్డలన్నీ సర్దాను, ప్రయాణం రేపేనని" ఆ రోజు ఆఫీసుకు వెళ్ళేముందు అతని కలదువ్వుతూ అడిగింది-

"ఆ! పెడతాను" క్లుప్తంగానే సమాధానమిచ్చాడు.

'కనీసం రెండు నెలలైనా ఉండగండి. అక్కడ రెండు నెలలుంటే గాని నా భ్రమతీరదు"

అతడు నీరసంగా నవ్వుతూ "అబ్బొ రెండు నెలలే" అన్నాడు. పై పంచ నందుకుంటూ.

"మఱచిపోకండీ. తిరిగి వారం రోజులదాకా మంచి రోజులు లేవు ప్రయాణానికి" అని బయటిదాకా వచ్చి, హెచ్చరించి తలుపువేసుకుంది.

ఆరోజు పనులన్నీ త్వరగా ముగించుకుని ముస్తాబై సాయంత్రం నుంచే భర్తకోసం ఎదురు చూస్తూ కూర్చుంది అన్నపూర్ణ.

పుట్టింటికి వెళ్లి తనభర్తను పూర్వపువాణ్ణి చేసుకోవచ్చు. ప్రారంభంలో ఆమె తగిన శ్రద్ధ చూపకపోతే అతడు తదనంతరం మరీ చెడిపోవచ్చు. ఆ వూరునుంచీ ప్రస్తుతం అతన్ని వేరు చేయడంకన్నా మార్గాంతరం లేదు. ఇప్పుడే తాను జాగ్రత్తపడకపోతే తానొకవైపు సౌఖ్యం లేకుండా చెడిపోగా, అతని ఆరోగ్యమూ చెడిపోతుంది. యిలా ఆలోచిస్తుండగానే చీకటి జల్లులాగా వర్షమూ ప్రారంభమయింది. చూస్తూండగానే పెద్దదై నిర్విరామంగా రెండుగంటల పాటు ఘోరు గాలితో కుండపోతగా కురిసింది. పదకొండున్నర దాటింది. వాసునిలువునా తడిసి వచ్చాడు యింటికి.

అతడు పొడి బట్టలను వేసుకుంటూంటే

"ఈపూటకు స్నానం అవసరం లేదుగా" అంది అన్నపూర్ణ నవ్వుతూ.

"స్నానమేగాదు. భోజనంగూడా అవసరం లేదు" అన్నాడు ప్రక్కమీద కూర్చుంటూ.

"నిజమేనా యేమిటి? యీ వేషాలు మాని లేవండి భోజనానికి. పొద్దుటనుంచి భోజనంచేశారు. మీరలా పడుకుంటే నేనూ భోంచేయను.' అని అతనిప్రక్కనే కూర్చుంది.

"నన్నట్టే విసిగించక వెళ్ళి భోంచేయి. నాకీ వేళ ఓపిక గూడా లేదు మాట్లాడడానికి."

"అవును యెందుకుంటుంది? ఈ వూరు వదలాల్సివస్తేనే మీకు ఓపిక వుండదిపుడు."

"సరే. యెప్పుడూ వున్నగోలే. త్వరగా భోంచేసిరా. పన్నెండయింది."

"చెప్పానుగా. మీరు లేవంది నేను తినను. నేనూ వుపవాసమే" అని అతని తొడమీద తలపెట్టుకు పడుకుంది.

'లే. మరి వడ్డించు. నా కడుపు నిండంది నీకు నిద్రబట్టకపోవడం అలవాటేగా" ఆమెను లేవతీస్తూ అన్నాడు.

"రేపు పొద్దయిం బండికా మధ్యాహ్నం బండికా మన ప్రయాణం?" అని అడిగింది అతనికి నేయి వడ్డిస్తూ.

"ఆ. మరచిపోయాను రేపు నీవుమాత్రమే వెళ్ళాలి. నాకు రెండు రోజుల తరువాత గాని సెలవు యివ్వమన్నారు."

"నే ననుకున్నంతా అయిందన్న మాట. మీరు రాంది నేనూ వెళ్లనూ."

"అదిగాదు. నీవెళ్ళిన మూడోరోజే నేను వస్తాను. రేపు నీవాగే పక్షంలో తిరిగి వారం రోజులదాకా మంచిరోజులు లేవు. పైగా మూడు రోజుల తరువాత సెలవు యిస్తామన్న ఆఫీసరు మనస్సు అప్పటికి మారవచ్చు. నేను తప్పక వస్తాగా. నామాట నమ్మవా ?"

అన్నపూర్ణ ఆలోచనలో పడింది. తన భర్త చెప్పింది నిజమే. వారం రోజులలో అధికారి మనస్సెలావున్నా, ఆమె భర్త మనస్సే మారుతుందేమో. ఆమె రేపే వెళ్తే, అతడు మూడు దినాలకే తప్పక వస్తానంటున్నప్పుడు ఆమె సంకోచించ గూడదు. పైగా తన భర్త తనతో యెప్పుడూ అబద్ధమాడి యెరుగడు.

'సరే చూద్దాంలెండి" అంటూ పెరుగంతా అతని విస్తట్లో బోర్లించింది.

"అరే అంతా నాకే వేస్తే నీకేదీ.

"వుందిలెండి. ముందు మీరు భోంచేయండి. నా విషయం మీకెందుకూ."

"అంతా వుత్తదే. ఉన్నదంతా నాకే వేశావు. సరే నీకోసమైనా తింటాను.

వాసు భోజనం ముగించి వెళ్లి పడుకున్నాడు. ఆమె గూడా త్వరలోనే పూర్తిచేసి వెళ్ళి అతని ప్రక్కమీద నేతమలపాకులను చుడుతూకూర్చుంది.

"మీరు నిజంగా నేను వెళ్ళిన మూడో రోజునే వస్తారు గదూ దీనంగా అడిగింది."

"ఆ. వస్తాగా."

"అయితే రేపు 5 గంటల బండికే నేను వెళ్తాను. నన్ను పంపండి"

"సరే వెద్దవృగా నన్నానుగా పడుకో" అన్నాడు ఆవుల నందుకుంటూ.

ఆమె అతన్ని కౌగిలించుకొని "అబ్బా వళ్ళంతా యిలా మండిపోతోందేం" అంది ఆశ్చర్యంతో,

"ఆ! యేమీ లేదు. వర్షంలో తడవడం మూలంగా వెచ్చబడింది. భయపడకు" అన్నాడు అతని బాహువుల్లో ఆమెను అదుముకుంటూ.

ఆమె అతని తల నిమురుతూ "నన్ను త్వరగా చీకటితోనే లేపండి 8 గంటలకేగా ప్రయాణం.

అన్నపూర్ణ నాలుగింటికే లేచి ప్రయాణ సన్నాహం చేసింది. స్టేషను దాకా వెళ్లాడు వాసు. అతని ముఖమంతా వాడివుంది. కండ్లు జ్యోతుల్లాగా యెర్రబడ్డాయి. అతని ముఖవర్చస్సులో కలిగిన ఆ మార్పును చీకటవడం మూలాన్ని ఆమె తెలుసుకొనే అవకాశం లేకపోయింది. ఆమె వెంటనే కంపార్టుమెంటుదాకా వెళ్ళి బెడ్, సూట్ కేస్ అందించాడు.

"మీరు తప్పక వస్తారు గదూ! పైగా మీకు హోటలు తిండీగూడా పడదు" అంది.

దాని కతడు తలవూపి వూరుకున్నాడు. గార్డు విజిల్ వేశాడు. రైలు కదలబోతూంది. ఆమె కంపార్టుమెంటు గేటుదగ్గరికి నడిచి వచ్చి నిల్చుంది. రైలు ఘీంకారం చేసి కదిలింది.

"తప్పక రండీ. మూడు రోజులకు మీరు రాకపోతే నాలుగోరోజు నేను తిరిగి రావడం తప్పదు."

"సరే నన్నానుగా" అన్నాడు వాసు ముఖమటువైపుకు తిప్పుకుని ఆ మాట రైలు గర్జనలోనే కలిసిపోయింది కాని ఆమెకు వినిపించలేదు. అతని కండ్లవెంట బొటబొట నీళ్లు కారడం ఆమె చూడనేలేదు. పాపం!

నాలుగురోజులు గడిచాయి. వాసు రాలేదు. ఆమె ఆందోళన మరీ యెక్కువైంది. మధ్యాహ్నం పరధ్యాన్నంగా ఆలోచిస్తూ పడుకుంది.

"టెలిగ్రాం సార్" బయట పోస్టుమాన్ కేక వినిపించి త్రుళ్ళిపడి పక్క అంగలో బయటికి వెళ్ళింది.

సంతకంచేసి తీసికొని వణుకుతున్న చేతుల్తో కవరు చింపి చూచింది. గుండెలు ఢక్కుని పగిలిపోయాయి. "నాన్నా" అంటూ బయటికి వచ్చిన తండ్రిని అమాంతం పసిపిల్లలా కౌగిలించుకొని భోరున యేడ్చింది.

"ఇంకేముంది కొంప మునిగిపోయింది వాసు పోయాడట రావే" అని ఆయన కాగితాన్ని చూచి గుండెలు బాదుకుంటూ భార్యను పిలిచాడు. ఏముంది యిల్లంతా క్షణంలో గగ్గోలు!

రైలుకే బయలుదేరారు అందరూ. బండి దిగడంతోటే లోపలి శవంమీద పడి గోలుగోలున యేడ్చింది అన్నపూర్ణ పాపిష్టిది అంత్యకాలంలో నన్నా దగ్గఱ వుండిందిగాదు. తాను తలచింది వేరు. జరిగింది వేరు. అంతా ఓదార్చేవారే. తన కడుపెంత దహించుక పోతున్నదో వారికేం తెలుసు.

వాసుకు అంత్యక్రియలు యధావిధిగా జరిగాయి. తాను నాలుగు దినాలక్రితం అతనితో చివరిసారి పడుకున్న మంచంమీదనే పడి అల్లాడుతున్నది అన్నపూర్ణ. ఏడుస్తూ చెయ్యి తడుముకుంటూండే పరుపు తలగడక్రింద ఒక చీటీ చేతికి తగిలింది. పమిటి చెంగుతో కండ్లు తుడుచుకుని చూచింది. తనవాసు వ్రాసిందే. తనకు వ్రాసిందే.

'అన్నపూర్ణా,

నేను నీకు వాగ్దానం చేసినట్లు రాలేకపోయాను. నేను రాకపోతే వస్తానన్న నీమాటే నిజమౌతుందేమో! నాలో వున్న ఒకజబ్బు కారణంగా నేను నెల దినాలకన్న అధికంగా జీవించలేనని డాక్టరు చెప్పాడు. ఆ విషయాన్ని నీకు చెప్పి నిన్ను కలవరపెట్ట దల్చుకోలేదు. అందువల్లనే నీకు ఆవిషయం తెలియజేయ లేదు. అందుకు నన్ను క్షమించు. నాలో వచ్చిన మార్పు కదే కారణం. నీవు నన్న పార్థం చేసుకొని చాలా కష్టపడ్డావు. కాని యీ బాధకన్నా, అసలు విషయం తెలిస్తే పడవలసిన బాధే అతి ఘోరంగావుంటుందని నా రహస్యాన్ని దాచాను.

ఈ రెండు సంవత్సరాలూ యెవరూ అనుభవించలేని సౌఖ్యాన్ని మనమనుభవించాము. దేవుడు మన దాంపత్యాన్ని చూచి ఓర్చలేకపోయాడు. నా అంత్యకాలంలో నీవుంటే భయపడతావనే నీవు పుట్టింటికి వెళ్లడానికి అంగీకరించాను జీవిత కాలమంతా పుట్టింటనే వుండవలసిన అగత్యంనీకు వుందని నాకు తెలుసు. పుట్టింటనే వుండు. నా భౌతిక రూపం నశించినా, నా ఆత్మ నీ పుట్టింటికే వస్తుంది. శాశ్వతంగా నీ వెంటనే వుంటుంది. నిన్ను కాస్తూనే వుంటుంది. నీస్థానం నీ పుట్టిల్లే. ఇక్కడ వుండకు. వెంటనే బయలు దేరు. నా ఆత్మ నీ వెంట నేవస్తుందిప్పుడు. పూర్వం నీవు కోరినట్లు శరీరంతో రాలేకపోయినా, నా ఆత్మ నిన్నే ఆవరించి నీ వెంటనే వస్తుంది. నన్ను మరచిపోకు.

ఇట్లు,
నీ వాసు."

ఇంతలో తన తండ్రి వచ్చాడు అక్కడికి. ఉత్తరాన్ని ముఖాంకడ్డం పెట్టుకొని అతని భుజం మీద పడి భోరుమని యేడ్చింది.

స్కెచ్

# అంబా భీష్ముల సంవాదం

అవసరాల రామకృష్ణారావు

అసిస్టెంటు మేనేజరు శంకర్రావుకి ఆఫీసులో ఏమీతోచక సిగరెట్లు ఒకటిమీద ఒకటి తగలేస్తున్నాడు. నిజానికి అతనికి ఆఫీసులో పెద్ద చెప్పుకో తగ్గంత పనేమీ లేనేలేదు! పాపం మేనేజరే స్వయంగా అంతపనీ చక్కబెట్టుకుంటాడు. అలా చేస్తే కాని అతనికి తృప్తి వుండదు. ఇక ఎటొచ్చీ తన పని చిన్న గుమస్తాలంతా తమతమ పనులు సరిగ్గా చేసుకుంటున్నారో లేదో పరీక్షించడమే! పాపం, తీక్షణమైన ఎండలో మంచి జోడేనా లేకుండా పది గంటలకల్లా వచ్చేసి సాయంకాలం అయిదింటి దాకా, బితుకు బితుకుమని పనిచేసే గుమాస్తాల మీద అధికారంచెలాయించటం అతనికి నిజానికి చేతకాదు. ఇక శంకర్రావుకి తీరికకు లోటేమిటి?

ఈపాటికి యింటిదగ్గిర నిర్మల ఏంచేస్తోందో! తనలాగే తోచక బాధపడుతోంది కాబోలు! పోనీ యింటికి పోదామా అంటే కనీసం ఆఫీసులో ఎటెండన్సు అయినా ఉండాలా! శంకర్రావుకి తన పేరు పత్రికలో చూసుకుందామని ఏనాటినుంచో కోరికగా వుంది. ఏదైనా రచన చేద్దామా అన్నా ఎప్పటికప్పుడు బద్ధకమే ఐపోతోంది. ఇవాళ ఎలాగైనా సరే ఏదో ఒక వ్యాసం రాసితీరాలని శంకర్రావు కలం, కాగితం తీసుకున్నాడు.

అరగంటసేపు కాగితాలయుద్ధభూమిలో కలాల బాణాలతో యుద్ధంచేసి, అనేక కాగిత- సైనికుల్ని హతమార్చి ఎలాగయితేనేం శంకరరావు విజయం పొందేడు. 'నేటి స్త్రీల విచిత్రగతులు' అని వ్యాసానికి పేరుపెట్టాడు. ఆ వ్యాసంలో సారాంశం ఇది: "భారతదేశంలో పూర్వపుస్త్రీల ప్రవర్తనకీ నేటి స్త్రీల ప్రవర్తనకీ చాలా తేడా ఉంది. పూర్వపు స్త్రీలకి భర్త అన్నా దేవుడన్నా కాస్త భయం భక్తీ ఉండేవి. నేటి స్త్రీలకు వీటితోపాటు సిగ్గూ, అభిమానమూకూడా లేవు. ఏదైనా తప్పుపనిచేస్తే, భర్త ఎదిరిస్తే, విడాకులిస్తామని బెదిరిస్తున్నారు. కట్టుబాట్లూ నీతీ బొత్తిగా నాశనం అవుతున్నాయి. ఈ నాశనం స్త్రీ విద్యవలనే సంక్రమిస్తోందని నా ఉద్దేశం."

ఈ విధంగా స్త్రీమీద తనకుగల హేయ భావాన్నంతా ప్రకటనచేశాడు శంకర్రావు. ఈ వ్యాసం తీరావడి తన భార్య నిర్మల చూస్తే! ఇలాంటి భేదాభిప్రాయాలు రాకుండా శంకర్రావు 'భీష్మ' అనే మారు పేరుతో ఒక పత్రికకు పంపేడు. సంపాదకుడు